

రంగారెడ్డి I వికారాబాద్ I మేడ్చల్
వార్త

# ప్రజా సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలి

**ఇబ్రహీంపట్నం, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రజల వద్దకే పరిపాలనను తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పోచారం గ్రామపంచాయితీ అదే విధంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 6, 8 వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నిరక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల మేరకు ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మిగిలిన హామీలను సైతం ప్రాధాన్యత క్రమంలో త్వరలోనే నెరవేరుస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పోచారం గ్రామంలోని రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల స్థానికులు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన తక్షణమే స్పందించి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో చర్చించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఎంపీడీవో బాలశంకర్‌ను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయాలకు తావు లేదని ఆయన తేల్చి చెప్పారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 6,8వ వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే.. పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు పలు సూచనలు చేశారు. అదేవిదంగా 6వ వార్డులో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు వచ్చిన విజ్ఞప్తిపై స్పందిస్తూ త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్ రెడ్డి, పోచారం సర్పంచ్ తాళ్ల వెంకటేష్, ఎంపీవో ఉషాకిరణ్, కౌన్సిలర్లు అమీనాబేగం తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



# మహిళా భద్రతకు బాసట

**వారికి ఏ అసౌకర్యం వచ్చినా సొంత మనిషి వలే స్పందించండి**

**స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సిఎం రేవంత్ పిలుపు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 7, ప్రభాతవార్త :** కూకట్‌పల్లిలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డిజిపి చారుసిన్హా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాండ్ విత్ హర్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు కలెక్టర్ మనుచౌదరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మన కుటుంబ సభ్యులకు అసౌకర్యం గాని అవమానం గాని జరిగితే ఏ విధంగా ఆలోచిస్తామో ప్రతి మహిళ పట్ల అదే విధంగా నివారణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి, నగర సిపి సజ్జనార్, హయర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, సైబరాబాద్ సిపి ఎం.రమేశ్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా.. ఆరా



గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక బాటలో కలెక్టర్**
- ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల తనిఖీ
- మధ్యాహ్న భోజనం పరిశీలన
- మెనూ బోర్డు పెట్టాలని ఆదేశం
- విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని దిశానిర్దేశం
- పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రతపై దృష్టి
- తహసీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలూ సందర్శన
- పెండింగ్ ఫైళ్లు క్లియర్ చేయాలని సూచన

**పరిగి, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ దీపక్ తివారి పరిగి మండలంలోని వివిధ గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. పలు నప్రభుత్వ సంస్థలను సందర్శించి అక్కడి పరిస్థితులపై సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. తుంకులగడ్డలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం కచ్చితంగా భోజనాన్ని అందివ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులకు విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగు మందులను ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు సూచనలు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో పరిసరాలు పరి శుభ్రతపై చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో మెనూను చార్ట్ రూపంలో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో ఉపయోగపడే సిపిఆర్‌పై అవగాహన కల్పించాలన్నారు. భోజనశాల, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నిర్మాణాల్లో ఉన్న వివిధ భవనాల పనులను వేగవంతం చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

**అధికారులే మీ దగ్గరకు వస్తున్నారు..**

అధికారులే గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నందున స్థానిక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తే, పరిష్కారం చేస్తారని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వివిధ గ్రమాల ప్రజలకు సూచించారు. శనివారం చిగురాల్ పల్లి, గోవిందాపూర్‌లో నిర్వహించిన సభల్లో కలెక్టర్ మాట్లాడుతూ.. 99 రోజులపాటు నిర్వహించే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధుల సహకారం, ప్రజల భాగస్వామ్యంతో సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికి గ్రౌండింగ్ కానీ ఇందిరమ్మ ఇళ్లకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించి వారిని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో డిటిడబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, డిపిఓ జయసుధ, తహసిల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో హరి ప్రియ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, చైర్ పర్సన్ రజిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా సుజాత, ఐసిడిఎస్ సూపర్వైజర్ సింధు, సర్పంచులు ఆయేషా బేగం, హరి చందర్ పాల్గొన్నారు.

# యంనంపేట్‌లో గంజాయి ర్యాకెట్

**పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నిందితుడు**
- కర్ణాటక నుంచి బాలెనో కారులో రవాణా
- రూ.30 వేలకు రెండు కిలోలు కొనుగోలు
- 4 గ్రాముల ప్యాకెట్ రూ.400కి స్థానికంగా విక్రయం

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 7, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ డివిజన్ పరిధిలోని యంనంపేట్ పరిసరాలలో గంజాయి ర్యాకెట్ గుట్టును ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. శుక్రవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీ దందానే వెలుగులోకి వచ్చింది. కర్ణాటకలో పెద్ద మొత్తంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా అధిక ధరకు యంనంపేట్ పరిసరా ప్రాంతాల్లో విక్రయిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. యంనంపేట్‌కు చెందిన శివసాయిరెడ్డి అలియాస్ చెడ్డి (27) తన బాలేనో కారు (నెంబరు టీఎస్ 08 ఎం 2081)ను తనిఖీ చేయగా.. కారులో డ్రైవర్ సీటు కింద బ్లాక్ ట్రాన్స్‌పోర్ట్ కవరును పోలీసులు గుర్తించారు. అందులో ఇంగ్లీస్ న్యూస్ పేపర్‌లో చుట్టిన చిన్న ప్యాకెట్లు కనిపించాయి. దాదాపు 30 ప్యాకెట్లు లభించగా మొత్తం డ్రై గంజాయి బరువు కిలో 540 గ్రాములు ఉన్నట్లు నిర్ధారించారు. పోలీసులకు పట్టుబడిన శివసాయిరెడ్డి అమెజాన్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లి అక్కడ అబ్బాసీ అలీ అనే వ్యక్తి నుండి డ్రై గంజాయిని మూప్పై వేలకు రెండు కిలోలు కొనుగోలు చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో తెలిపారు. 4 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కొక్క ప్యాకెట్టు 400 రూపాయలకు యంనంపేట్‌తో పాటు రాంపల్లి గ్రామాల్లో తమ కస్టమర్లకు విక్రయిస్తున్నట్లు వివరించాడు. గంజాయితో పట్టుబడిన శివసాయి రెడ్డితో పాటు గంజాయి విక్రయదారుడు అబ్బాసీ అలీ అలియాస్ అబుజర్ అలీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుండి ఎండు గంజాయితోపాటు బాలెనో గ్రే కలర్ మారుతి కారు, వివో ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో నిందితుడు అబ్బాసీ అలీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.



పోలీసులకు పట్టుబడిన నిందితుడు. స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు




కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

# మాదకద్రవ్యాల మత్తులోనే.. మహిళలపై అత్యధిక దాడులు

**రక్షణకు సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావాలి**

**వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియూ నేతల ఆందోళన**

**కొడంగల్, మార్చి 7 ప్రభాతవార్త :** మహిళల హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా వారి రక్షణకు సంఘటితమై పారాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్‌రాములు, సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ పిలుపునిచ్చారు. శనివారం కొడంగల్ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ అధ్వర్యంలో మార్కెట్ యార్డులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభకు అంగన్‌వాడీ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికి అదే స్థాయిలో వారి పై అణిచివేత, హింస, వివక్ష పెరుగుతుండడం ఆందోళనకరమన్నారు. మహిళలపై జరిగే నేరాల్లో అధిక శాంతం మద్యం, గంజాయి వంటి మాద ద్రవ్యాల మత్తులోనే జరుగుతున్నాయన్నారు. శ్రామిక మహిళల హక్కులను సాధించిన రోజుకు గుర్తుగా మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారని. ఈ సంవత్సరం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి మహిళల ఉపాధిపై పాలకులు దెబ్బ కొట్టారని అన్నారు. గతంలో కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారని, నేటి పాలకులు పనిగంటలు పెంచుతూ కార్మిక హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు.

అందుకు మహిళలు తమ హక్కుల రక్షణ కోసం తామే పోరాటానికి ముందుకు రావాలన్నారు. రాజకీయంగా ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత శిఖరాలలో నిలిచిన మహిళలకు అన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వ్యవసాయ కార్మికులు పోరాడి సాధించుకురన్న ఉపాధి మమీ చట్టాన్ని రరద్దు చేసి రాంజీ స్కీంములు తీసుకువస్తున్నారన్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కోషాధికారి బుస్స చంద్రయ్య, సిఐటీ యూ జిల్లా ప్రధాన కార్య దర్శి కె.శ్రీనివాస్‌లతో పాటు ఆయా సంఘాల నాయ కులు రామకృష్ణ, మల్కయ్య, సతీష్, రాజు, అక్బర్, అనిల్, సంతోష, నర్సమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు



ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

# కబ్జాలను అడ్డుకోండి

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయ్
- కార్యాలయాల భవనాలకు స్థలాలు దొరకడంలేదు
- 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక'లో ఎమ్మెల్యే ఆదేశం

**ఆమనగల్లు, మార్చి 7, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలంలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంతో కార్యాలయాల భవనాలకు స్థల కొరత ఏర్పడుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించి కబ్జాలను అడ్డుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని జాతీయ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కసిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని చెబుతూ.. త్వరలోనే కార్యరూపంలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలనే ఆశయంతో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశామన్నారు. రూ.17.50కోట్ల వ్యయంతో నిర్మాణమవుతున్న నూతన భవనం వినియోగంలోకి వస్తే ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రజాసమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను కోరారు. ఫ్యూచర్ సిటి నిర్మాణంతో హైదరాబాద్ దక్షిణ భాగం అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి, డిఎంహెచ్ఓ లలిత, డిప్యూటీ డిఎంహెచ్ఓ వినోద్, జడ్‌పి సీఈఓ కృష్ణారెడ్డితోపాటు మండల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# పేదల భూముల్లో పెద్ద రిసార్టులు



సంగెం గ్రామంలో భూదాన్ భూమి చుట్టూ గోడ కట్టి గేటును ఏర్పాటు చేసిన దశ్యం

**'సంగెం'లో దానంగా ఇచ్చిన భూములకు రెక్కలు**

**పక్కా పథకంతో పది ఎకరాల్లో పాగా**

**రూ.30 కోట్ల భూదాన్ భూమి హస్తగతం**

**అన్నీ తెలిసినా అధికారులు గప్ చుప్**

**షాద్‌నగర్, మార్చి 7, ప్రభాతవార్త :** పేదవారి జీవనోపాధికి కాసింత భూమి ఉండాలనే ఉన్నత ఆశయంతో భూస్వాములు దానంగా ఇచ్చిన భూములకు రెక్కలొచ్చాయి. భూదాన్ బోర్డు ద్వారా పేదలకు పంచిన భూములను రియల్ వ్యాపారులు తమదైన శైలిలో అప్పటి రెవెన్యూ యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకొని స్వాహా చేశారు. రైతులకు డబ్బు ఆశ చూపి కోట్ల రూపాయల విలువైన భూదాన్ భూములను తమ కబంధాల్లోకి తీసుకున్నారు. రిజిస్టర్ చేయకూడదని అధికారిక రికార్డులు నమోదై ఉన్నప్పటికీ ఆ నిషేధిత భూములు రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టార్‌లు యదేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేశారు.. వారి పని వారు చెస్తే రెవెన్యూ రికార్డుల్లో భూదాన్ భూములని స్పష్టంగా ఉన్నా గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు వాటిని పట్టా భూములుగా మార్చి వ్యాపారుల పేర్లను రికార్డుల్లో నమోదు చేశారు. కోట్ల రూపాయల విలువైన భూముల ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తెలుస్తుంది. భూదాన్ బోర్డు ద్వారా సంక్రమించిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని బయటపడితే వెంటనే ప్రభుత్వం ఆయా భూములను తమ ఆధీనం లోనికి తీసుకోవాలి. నేటికీ పాత రెవెన్యూ రికార్డుల్లో భూదాన్ భూములుగా నమోదై ఉన్న ఆ భూములు అధికారుల పుణ్యమా అని ధరణి రికార్డుల్లో పట్టాలుగా మారి ఏకంగా ల్యాండ్ కన్వర్షన్ కూడా జరిగిపోయాయి. అమ్మిన వారు అమ్మారు... కొన్న వారు కొన్నారు... అధికార యంత్రాంగం వారికి అనుకూలంగా రికార్డులను మార్చారు.. కానీ భూమి పూర్వ స్వభావం మాత్రం పాత రికార్డుల్లో అలాగే నిక్షిప్తమై ఉంటుందనే విషయం మరిచారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో అధికారుల కక్కుర్తికి అన్యాక్రాంతం అయిన భూదాన్ భూముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. పేదలు ఉండాల్సిన భూముల్లో పెద్ద పెద్ద రిసార్టులు వెలుస్తున్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం సంగెం గ్రామంలో భూదాన్ భూమి ఉంది. గ్రామానికి చెందిన భూస్వామి భూదాన్ ఉద్యమంలో బాగంగా తనకున్న కొంత భాగం భూమిని భూదాన్ బోర్డుకు ఇచ్చారు. తదనంతరం భూదాన్ బోర్డు ద్వార గ్రామానికి చెందిన నిరుపేదలకు ఆ భూములను కేటాయించారు. అయితే సదరు భూములు భూదాన్ భూములని ఈ భూములను క్రమ విక్రయాలు జరపకూడదని సబ్ రిజిస్టర్‌లకు ఆదేశాలు ఇస్తూ అప్పట్లోనే ఐజిఆర్ఎస్‌లో నిషేధిత మిగతా 2లో



యాడారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయిస్తున్న వజ్రేశ్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష

# పేదలందరికీ అండగా ఉంటున్నాం

**డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్**

**శామీర్‌పేట, మార్చి 7, ప్రభాతవార్త :** అర్హులైన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ తెలిపారు. శనివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని యాడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు అవ్వగా.. వీటిలో 2,500 ఇళ్లకు నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. వీటిలో కొన్నింటికి గృహప్రవేశాలు కూడ జరుగుతున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం ఉన్న అర్హులైన పేదలందరీ ఈ పథకం అములు అవుతుందన్నారు. ప్రభుత్వం ఒకొక్క ఇంటి నిర్మాణానికి 5లక్షల రూపాయలు ఇస్తుందని, లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకోవాలని సూచించారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగ ఉంటుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు. అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కన్‌రెడ్డి మాలతిమాదవరెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, పార్టీ కౌన్సిలర్లు ఎస్.వనజఅశోక్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుధాకర్‌రెడ్డి, కైర గణేశ్, వెంకటేశ, మరి కొందరు కౌన్సిలర్లు, నాయకులు సుజాత, శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ, ఎల మల్లేశ్, ఎద్దు నాగేశ్, మాదవరెడ్డి, దినేష్, వెంకటేశ్, నర్సింగ్‌రావుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ చదువులమ్మ

## ఇంద్రార్జితకు యూపిఎస్‌సిలో 627 ర్యాంక్..



**షాద్‌నగర్, మార్చి 7, ప్రభాతవార్త :** కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు.. పాత మాట.. కృషి ఉంటే విద్యార్థులు అపర మేధావులు కూడా అవుతారు.. అలాంటి మేధావిగా, పట్టువదలని విక్రమార్కుడి వారసురాలిలా తన సత్తా చాటి యూపీఎస్సీలో ఒకసారి సాధించిన రికార్డు ర్యాంకును దాటి మళ్లీ అదే పరీక్షల్లో కొత్త రికార్డు నెలకొల్పింది షాద్ నగర్ పటణానికి చెందిన ఇంద్రార్జిత. సివిల్స్ ఫలితాలు విడుదలలో సత్తా చాటిన తెలుగు విద్యార్థులలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ అమ్మాయి కూడా ఉండడం గర్వకారణం. పట్టణానికి చెందిన రాఘవేందర్‌రావు అలియాస్ మంజుశ్రీ రఘు, మమత దంపతుల కూతురు గతంలోని సివిల్స్ రాసి 735 ర్యాంకు సాధించింది. సాధించిన ర్యాంకుతో సంతృప్తి చెందని ఇంద్రార్జిత మరోసారి తన అదృష్టాన్ని పరీక్షి ంచుకుంది. రెండో ప్రయత్నంలో 627 ర్యాంకును సాధించి తన సత్తా నిరూపిం చుకుంది. గత ఏడాది 2025లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిం చారు. ఇందులో అర్హత సాధించిన వారికి గత ఆగస్టు సెప్టెం బర్‌లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో కూడా అర్హత సాధించిన వారికి ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ వడపోతలో ర్యాంకు సాధించిన ఒక 1,087 మంది అభ్యర్థుల్లో ఇంద్రార్జిత 627 వ స్థానంలో ఉండడం విశేషం. ఈ ఘనతను ఒక్కసారి సాధించడమే గొప్ప విషయం. అలాంటిది రెండు సార్లు సాధించి షాద్‌నగర్ ఆణిముత్యం అనిపించుకుంది ఇంద్రార్జిత.



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ కె.మాలతిమాదవరెడ్డి

## సిసి రోడ్డు పనులు షురూ..

శామీర్‌పేట, మార్చి 7, ప్రభాతవార్త : అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలోని 5వ వార్డులో రూ.7.50లక్షలతో నిర్మించతలపెట్టిన సిసి రోడ్డు పనులకు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వైస్‌చైర్‌పర్సన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్లు కైర గణేశ్, గాదె వెంకటేశ, గుర్క కుమార్, తాల స్వప్న, ఎఐఇ సనా షాహిన్, సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అధికారులు

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**కొడంగల్, మార్చి 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అన్నారం గ్రామంలో రూ.30లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం అడిషనల్ కలెక్టర్ సుధీర్, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరు అయిన నిధులతో పనులు నాణ్యత పాటిస్తూ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఉషశ్రీ, ఎంఈఒ రాంరెడ్డి, గ్రామ సర్పంచ్ బైండ్ల నర్సప్ప, పంచాయతీ కార్యదర్శి ఆశప్ప, మాజీ ఉపసర్పంచ్ ప్రహ్లాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కడా ప్రత్యేక అధికారి

## నిర్వాసితులకు రెండు రోజుల్లో ఇళ్ల స్థలాలు

**కొడంగల్, మార్చి 7, ప్రభాతవార్త :** కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులపై శనివారం కడా ప్రత్యేక అధికారి సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని కడా కార్యలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తహసీల్దార్ రాంబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ శ్రీవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పరిసరాల్లో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు రెండు లేదా మూడు రోజుల్లో నివేశనా స్థలాలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి స్థానికులు సహకరించాలని కోరారు.




ఇబ్రహీంపట్నంలో మహిళా దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.

## ఇబ్రహీంపట్నంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**ఇబ్రహీంపట్నం, మార్చి 7, ప్రభాతవార్త:** మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శాస్త్రా గార్డెన్స్‌లో మున్సిపల్ పరిధిలోని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు.. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదల గోడును పట్టించుకోలేదని విమర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళా సంఘాలకు బస్సులు, పెట్రోల్ బంకులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్

# భావి తరానికి స్ఫూర్తి లక్ష వృక్షయాగం



క్వాంటం లైఫ్ యూనివర్సిటీలో గోశాలను సందర్శించిన హిమలయ గురువు జగదీష్ బాబాజీ

**కోట్‌పల్లి, మార్చి 7, ప్రభాతవార్త:** కోట్‌పల్లి మండల పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామంలోని క్వాంటం లైఫ్ యూనివర్సిటీ ఒక అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రమని హిమలయ గురువు జగదీష్ బాబాజీ కొనియాడారు. డాక్టర్ న్యూటన్, డాక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో సాగుతున్న యూనివర్సిటీ ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ ప్రాంగణంలో 80శాతం భూమిని కేవలం మొక్కలకే కేటాయించడం అభినందనీయమన్నారు. ప్రకృతిని ప్రేమిస్తే ఆ ప్రకృతి మనల్ని రక్షిస్తుందని, ఇక్కడ నాటిన ఔషధ మొక్కలు ప్రాణవాయువును అందించడమే కాకుండా మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. ముఖ్యంగా లక్ష వృక్ష యాగం సంకల్పం ద్వారా లక్ష మొక్కలు నాటాలనే తపన రాబోయే తరాలకు ఒక గొప్ప దిశానిర్దేశమని ఆయన ప్రశంసించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న 55 గోశాలను బాబాజీ ప్రత్యేకంగా సందర్శించారు. భారతీయ సంస్కృతిలో గోవుకు ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ గోశాల నిర్వహణ ఆధ్యాత్మిక శక్తిని పెంపొందిస్తుందన్నారు.

# రాముడు ప్రతిష్ఠించిన శివలింగం

## నేటి నుంచి పాంబండ రామలింగేశ్వరాలయం బ్రహ్మోత్సవాలు



**కుల్కచర్ల, మార్చి 7 ప్రభాతవార్త:** కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలో నెలకొన్న పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి ఆలయంలో శివలింగాన్ని శ్రీరాముడు ప్రతిష్టించారని స్థల పురాణం చెబుతోంది. అందుకే ఈ ఆలయంలో శివుడు రామలింగేశ్వరుడిగా కొలువై ఉన్నాడు. ఆలయంలో ప్రతి సంత్సరం రెండు పర్యాయాలు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. శ్రావణమాసాన్ని పురస్కరించకుని రెండు రోజులు, ఉగాది పర్వదినానికి ముందు 11 రోజులు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. మహరాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్‌కు చెందిన వేలాది మంది భక్తులు తరలివస్తారు. శివలింగం రాయితో ఉన్నా చేతితో తాకగానే మెత్తని అనుభూతి కలుగుతుంది. అందుకే చాలా మంది భక్తులు శివలింగానికి తలను అన్చి తమ కోరికలు నేరుగా స్వామి వారికి చెప్పుకుంటారు.

ప్రతి సవత్సరం పాంబండ దేవాలయం దగ్గర జరిగే బ్రహ్మోత్సవాల్లో అగ్నిగుండం కార్యక్రం ఏర్పాటు చేస్తారు. భక్తులు తమ కోర్కెలు తీరాలని నిప్పుల్లో నడుస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 8న ఉత్సవమూర్తిని ఆలయ అర్చకుల ఇంటి నుంచి పాంబండపైకి తీసుకురావడంతో వేడుకలు ప్రారంభమవుతాయి. మొదటి రోజు గణపతి హోమం, ధ్వజారోహణ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, పల్లకి సేవలు ఉంటాయి. 9న రుద్రహోమం, సాయంత్రం పల్లకి సేవ, 10న శకటోత్సవం, పల్లకి సేవ, హారతి, 11న పల్లకి సేవ, హారతి, 12న పల్లకి సేవ, 13న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం పల్లకి సేవ, 14న తెల్లవారుజామున రథోత్సవం, పల్లకి సేవ, సర్వదర్శనం, సాయంత్రం పల్లకి సేవ, 15,16,17న సర్వదర్శం సాయంత్రం పల్లకి సేవ 18న తెల్లవారుజామునా అగ్నిగుండాలు, అమావాస్యను పురస్కరించకుని ప్రత్యేక పూజలు. 19 ఉగాది వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయి.



### అన్ని ఏర్పాట్లు చేశాం శ్రీనివాస్, సర్పంచ్

ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని బండవెల్కిచర్ల సర్పంచ్ మడుగు శ్రీనివాస్ తెలిపారు. ఇతర నాగరాల నుండి, ఇతర రాష్ట్రాలనుండి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున విశ్రాంతి తీసుకోవాడానికి గదులను అందుబాటులోకి తీసుకువచ్చామని ఆలయ చైర్మన్ కొట్ల మహిపాల్ రెడ్డి తెలిపారు. నీటి సౌకర్యం, శౌచలయాలు ఏర్పాటు చేశామన్నారు.



మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**కొత్తూరు, మార్చి 7, ప్రభాతవార్త:** మహిళలు ప్రతి రంగంలో ముందుకు సాగి తమ ప్రతిభను చాటుకోవాలని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తూరు మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి సమాజానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మున్సిపల్ మహిళా సిబ్బందిని సత్కరించి అభినందించగా.. చైర్‌పర్సన్‌ను కౌన్సిలర్లు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిడిఎంఎ జాయింట్ డైరెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ మమత, వైస్‌చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ పీర్లగూడెం మాధవి గోపాల్ గౌడ్, చంద్రకళ రాజేందర్ గౌడ్ ,అనిత శ్రీనివాస్ గౌడ్, కమ్మరి జయమ్మ జనార్ధన్ చారి, బ్యాగరి ప్రసన్న లత యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రోత్సహిస్తే మేమూ రాణిస్తాం

## మహిళా దినోత్సవ వేడుకలో వైస్ చైర్మన్ గీత




వైస్ చైర్మన్ తల్లోజు గీతను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

**ఆమనగల్లు, మార్చి7, ప్రభాతవార్త:** మహిళల పట్ల చిన్నచూపు చూడకుండా వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తారని ఆమన గల్లు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో దూసుకెళుతున్న తీరును కొనియాడారు. ప్రతి మహిళ చైతన్యవం తురాలు కావాలంటే విధిగా చదువుకోవాలని సూచిం చారు. కంప్యూటర్ యుగంలో కూడా మహిళలకు రక్షణ లేకపోవడం శోచనీ యమని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠినమైన చట్టాల ఆవశ్యకత ఉందన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలోని అరబిందో హైస్కూల్‌లో అంత ర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి వైస్ చైర్మన్ తల్లోజు గీత ముఖ్య అతిథిగా హాజరైనారు. పాఠశాల కరస్పాండెంట్ నల్లబోలు సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ గీత మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర చాలా గొప్పదని, మహిళలు లేకపోతే మానవాళి మనుగడనే లేదన్నారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అడ్వైసర్ ప్రేమకుమారి, ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం బోడ నరేష్, భాస్కర్, నాజర్, శ్రీనునాయక్, రఘునాయక్, రాధ, సునీత, సౌమ్య, సౌజన్య, ప్రియాంక, సింధు, లావణ్య, ప్రేమలత, శైలజ, సంధ్య, భార్గవి, మహిళ తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళా ఓ మల్టీ టాస్కర్

## నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి
## మహిళా దినోత్సవంలో వక్తల పిలుపు



ఎఫ్‌టిసిసిఐ డైరక్టర్ సంగీతకు మెమెంటో అందజేస్తున్న అనురాగ్ వర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్చన తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 7, ప్రభాతవార్త:** మహిళలు ధైర్యంగా తమ హక్కుల సాధనకు పోరాడాలని ఎఫ్‌టీసీసీఐ డైరక్టర్ పి. సంగీత పిలుపునిచ్చారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఉన్నతస్థితికి ఎదగటం ద్వారా సమాజంలో మహిళల శక్తి సామర్థ్యాన్ని నిరూపించుకోవాలన్నారు. వివిధ రంగాల్లో నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని కోరారు. ఉద్యోగ ప్రదేశాల్లో మహిళల భద్రత, గౌరవం ఎంతో ముఖ్యమన్నారు. పని ప్రదేశాల్లో అసురక్షిత పరిస్థితులు, అన్యాయం ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా ఉండాలని సూచించారు. అనురాగ్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్చన మాట్లాడుతూ మహిళలు తమ జీవితంలో ఎదురయ్యే ప్రతి అడ్డంకినీ ధైర్యంగా ఎదుర్కొవాలని కోరారరు. తమ సమస్యలు, సవాళ్లలను మనసులో దాచుకోకుండా స్వేచ్ఛగా మాట్లాడాలని సూచించారు. ప్రతి మహిళా సహజంగానే ఒక మల్టీటాస్కర్ అనీ.. జీవితంలో ఎన్నో బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలిగే సామర్థ్యం మహిళలకే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ కమిటీ కన్వీనర్ డాక్టర్ శిరీషా, యూనివర్శిటీ అసోసియేషన్ డీన్ శ్రీనివాస చలపతి, ఆయా విభాగాల ప్రతినిధులు, కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.



పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, కమిషనర్ తదితరులు

## వార్డులలో క్లీన్ అండ్ గ్రీన్

**శామీర్‌పేట, మార్చి 7, ప్రభాతవార్త:** మజీద్‌పూర్ గ్రామంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం 10,11 వార్డులలో పరిసరాలు.. పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌లు పర్యవేక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా పారిశుద్ధ్య కార్మికులను చైర్‌పర్సన్, కమిషనర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు ఎస్.వనజఅశోక్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, మున్సిపల్ ఆర్ఓ వేణుగోపాల్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌గౌడ్, నర్సింగ్‌రావుగౌడ్, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశవర్కర్, అంగన్‌వాడి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల భూముల్లో పెద్ద రిసార్టులు

(మొదటి పేజీ తరువాయి)

భూములుగా పెట్టారు. భూదాన్ బోర్డు ద్వారా దానంగా పొందిన 1029 గుంటల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆ భూములపై కొందరు అక్రమార్కులు కన్ను పడింది. ఇంకేముంది అమాయక రైతులకు డబ్బు ఆశ చూపి ఐజిఆర్ఎస్‌లో నిషేధిత జాబితాలో ఉన్న 1029 గుంటల భూమి ఉన్నప్పటికీ అప్పటి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారిని మచ్చిక చేసుకుని రిజిస్టర్ తతంగం పూర్తీ చేశారు. అలా 2016లో మొదటి ఏజిపిఏ విజయవంతంగా పూర్తీ చేసుకున్న వారు ఆ భూమిని ఇతరులకు మారుస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ భూమీ ధర ఎకరానికి రెండున్నర కోట్లకు పైమాటే అంటే పది ఎకరాలకు సుమారు 30 కోట్ల వరకు ఉంటుంది. సంగెం గ్రామంలోని 1029 గుంటల భూదాన్ భూమి ధరణీ పోర్టల్ లోనే రిజిస్టర్ అయ్యింది. ధరణీ పోర్టల్‌లో సదరు భూముల ల్యాండ్ స్టేటస్ భూదాన్ భూములుగా రికార్డులలో స్పష్టంగా ఉన్నా ఫీజు కట్టించుకుని నాలా కన్వర్షన్ కూడా చేసేశారు. దీనిలో దర్జాగా పేదలను పక్కకు పంపించి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసుకొని పెద్ద పెద్ద సార్లు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ కు సమీపంలోనీ ఈ ప్రాంతంలో ఉన్న భూదాన్ భూముల అన్యాక్రాంతం లో పెద్ద తలకాయలు ఉన్నట్టు తెలుస్తుంది. ఇందులో అధికారులతో పాటు బడా వ్యాపారవేత్తలు పావులు కదిపినట్లు సమాచారం.

## ప్రగతి ప్రణాళికతో గ్రామాభివృద్ధికి బాట



పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్

**కొత్తూర్, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందని మక్తగూడ సర్పంచ్ శ్రీరాములు తెలిపారు. శనివారం కొత్తూరు మండలంలోని మక్తగూడ గ్రామంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ కావడంతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి చెత్తాచెదారాలను వేరు చేసి పారవేయడం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రావలిలా, వార్డ్ సభ్యులు చందర్, యశోద, రజిత, లావణ్య, ఉపాధ్యాయులు సత్యం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు ప్రత్యేక పథకాలు

**అత్తాపూర్ మార్చి 7, ప్రభాతవార్త :** మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సరళతరం చేశాయని వాటిని సద్వినియోగం చేసుకొని రాణించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్తాపూర్ బ్రాంచ్ మేనేజర్ కందుకూరి దివ్యభారతి అన్నారు. శనివారం ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ డివిజన్ లో గల బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ని మేకల వనిత రెడ్డి స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ దివ్యభారతి ప్రసంగిస్తూ...మహిళలు బ్యాంకు రుణాలు తీసుకొని ఆర్థికంగా బలంగా రాణించాలని మహిళలకు అన్ని విధాలుగా బ్యాంకు రుణాలు అందించేందుకు అండగా ఉంటుందని మహిళల కోసం ప్రత్యేక స్కీమ్‌లను తీసుకురావడం జరిగిందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి మాజీ, గొట్టాల ఉమారాణి మాట్లాడుతూ...మనము మన కుటుంబాన్ని పోషించుకుంటూ మనం ఉద్యోగాలు చేసుకుంటూ మనం వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా రాజకీయంగా ఎదుగుతూ దేశం గురించి కూడా ఆలోచించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బిజెపి మహిళా మోర్చా కార్యదర్శిని మేకల వనిత రెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వారు అన్ని రంగాల్లో రాణించటానికి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శిని అనురాధ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.





మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి మార్చి 7, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన చాకలి సత్తెమ్మ (65),అనారోగ్యానికి గురై శనివారం నాడు మృతి చెందారు. గత కొంతకాలంగా సత్తెమ్మ అనారోగ్యానికి గురై మృతి చెందడంతో గ్రామ గ్రామ సర్పంచ్ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ పెరుమల్లా లలిత జోతయ్య లు పరామర్శించి మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, ఉపసర్పంచ్ కోటీశ్వర్, వార్డు సభ్యులు కుమార్ నరసింహ శేఖర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య చర్యల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్

## ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించాలి

**తలకొండపల్లి మార్చి7, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలనలో భాగంగా శనివారం నాడు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బూజూరి పుష్పమ్మ అంజన్ రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామంలోని గ్రామపంచాయతీ అంగన్వాడీ కార్యాలయాల సమీపంలోని చెత్త తదితర పరిసరాలను పరిశుభ్రం చేశారు. చుట్టుపక్కల శుభ్రత పాటించాలని ఇలాంటి చెత్తచెదారం చేయకుండా పరిశుభ్రంగా చూసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పమ్మ అంజన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూజూరి పుష్పమ్మ అంజన్ రెడ్డి, ఉపసర్పంచ్ చప్పరి చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి అలివేలు, వార్డు సభ్యులు మొగిలి శెట్టి మహేష్, గొర్రె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు వివరిస్తున్న ఏఓ శ్రీనివాస్‌గౌడ్

## నానో యూరియాతో ఖర్చులు ఆదా

**ఆమనగల్లు, మార్చి7, ప్రభాతవార్త:** సాగులో మెలుకువలు పాటిస్తే రైతన్నలు అధిక దిగుబడులు పొందవచ్చని ఆమనగల్లు వ్యవసాయశాఖ డివిజన్ అధికారి శోభ అన్నారు. రైతులు సాగులో అవలంభివచ్చవలసిన పద్దతులు, అవగాహన లోపంతో పెట్టుబడులు అధికమై ఆర్థిక భారమవుతుందని చెప్పారు. శనివారం ఆమనగల్లు మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు నానో యూరియ వాడకంతో కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏడిఏతోపాటు ఏఓ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని రైతులకు నానో యూరియా గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు బాలకృష్ణ, మీనాక్షి, ప్రభావతి, భూదేవి, రైతులు తదితరులు ఉన్నారు.



ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న సర్పంచ్ దయాకర్ తదితరులు

## వేసవిలో మంచినీటి కొరత రాకుండా చూస్తాం

**పూడూరు, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రతిఒక్కరు గ్రామంలో పారిశుద్యం పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందని సర్పంచ్ టి.దయాకర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణతోపాటు వివిధ కాలనీల్లో చెత్తను తొలగించి పారిశుద్యం-పరిశుభ్రతపట్ల అవగాహనను కలింపిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మంచినీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోనున్నట్లు వివరించారు. మరుగునీటి కాలువల పరిశుభ్రతతోపాటు పాడైన అంతర్గత సిసి రోడ్ల మరమత్తులపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. త్వరలో గ్రామంలో వీధి దీపాలను అమర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## కేబుల్ వైర్లు చోరీకి యత్నం

### గంజాయి మత్తులో పోలీసుల ముందే వీరంగం



పోలీసులకు పట్టుబడ్డ యువకుడు

**నందిగామ, మార్చి 7, ప్రభాతవార్త :** నందిగామ మండలంలోని సిడితండాలో శనివారం ఉదయం స్క్రాప్ దొంగిలించే చిల్లర యువకుడ్ని పట్టుకున్నారు. జల్సాలకు అలవాటు పడిన బండకుంట తండాకు చెందిన సన్నీ (25) అనే యువకుడు వ్యవసాయ బోరు మోటర్ల వద్ద కేబుల్ వైర్లను కట్ చేసి అమ్ముకోవడమే పనిగా పెట్టుకున్నారు.

ఈ క్రమంలోనే శనివారం ఉదయం సిడి తండా సమీపంలో ఉన్న వ్యవసాయ పొలం పక్కన కేబుల్ వైర్లను దొంగలించి కాలుస్తుండగా గ్రామపంచాయతీ సిబ్బంది పట్టుకున్నారు. ఈ యువకుడి పై స్థానికులు ఆరా తీయగా గతంలో ఇతనిపై పోలీస్ కేసులు ఉన్నట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉన్న చిల్లర దొంగ వద్ద కటింగ్ ప్లేయర్, దొంగిలించిన కేబుల్ వైర్లు ఉన్నాయి. ఈ సంఘటన విషయమై సర్పంచ్ గబ్రు చౌహాన్ యువకుని అడ్రస్ వివరాలను ఆరా తీసి స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసుల ముందే యువకుడు పంచాయతీ సిబ్బందిపై వీరంగం సృష్టించాడు. ఎట్టకేలకు స్థానికుల సహాయంతో పోలీస్ వాహనంలో స్టేషన్ కు తరలించారు.

## పేదలకు అన్ని వేళల అండగా నిలుస్తాం : ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, మార్చి 7, ప్రభాతవార్త :** పేదల పట్ల తాము ఎప్పుడూ సానుకూలంగా ఉంటూ వారిని అన్ని వేళల ఆదుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ బస్తీవాసులు మర్యా దపూర్వకంగా వెళ్లి ఎమ్మెల్యేను కలిశారు. ఇటీవల కాలంలో బస్తీలో కొందరు బయటవ్యక్తులు తమ నివాసాలవద్దకు వచ్చి భయ బ్రాంతులకు గురిచేస్తున్నారని కొందరు బయట వ్యక్తులు తమ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ విషయంపై ఎమ్మెల్యే స్వయంగా ఆ ప్రాంతానికి వచ్చి ప్రజలకు ధైర్యం చెప్పారని తాము ఉన్నంత కాలం మీ నివాసాలకు గాని మీకు గాని ఎలాంటి ఇబ్బందులు తలెత్తవంటూ హామీ ఇచ్చారు.



# ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక

**షాబాద్, మార్చి 7, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు ప్రాథమిక పాఠశాల మరియు ఉన్నత పాఠశాల మన్మర్రిలో గ్రామ సర్పంచ్ లాలాపేట బందయ్య,గ్రామ కార్యదర్శి శివకుమార్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసప్ప,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాయులు మర్పల్లి అశోక్,ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత,పారిశుద్ధంపై ప్రతిజ్ఞ చేయించి పాఠశాల ఆవరణలోని చెత్తను తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ఇరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బసప్ప మరియు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని,అందులో భాగంగా పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం మార్చి పదిహేను తారీకువరకు కొనసాగుతుందని, ఈ పది రోజుల్లో గ్రామాల్లో మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత,పారిశుధ్యం, ప్రభుత్వ భవనాల సంరక్షణ,రికార్డుల సమగ్ర నిర్వహణ, పెండింగ్ ఫైల్ల పరిష్కారం,డిజిటల్ పాలన బలోపేతం వంటి అంశాలపై దృష్టి సాధించాలని తెలపడం జరిగింది. విద్యాశాఖ పాలన పరిధిలో పాఠశాల ప్రాంగణమంతా పరిశుభ్రతలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, వంటశాలలు, కార్యాలయాలు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టాలని, త్రాగునీరు,మరుగుదొడ్ల పరిశుభ్రంగా ఉంచాలని, శానిటేషన్ కార్మికులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని,పాఠశాల సిబ్బంది అందరూ రోజువారి కార్యక్రమాలను పాటించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది దశరథ రెడ్డి, అంబర్ సింగ్,పరమేష్ సుదర్శన్, చంద్రయ్య, వెంకటమ్మ,శ్రీలత,చంద్రకళ, శ్యామలమ్మ,మల్లమ్మ, వెంకటయ్య,రాజలింగం, పరమేష్,తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్

# స్వయంగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శ్రమదానం

**షాద్‌నగర్, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక్తలో అందరూ భాగస్వాములు కావాలని షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ పిలుపునిచ్చారు. శనివారం షాద్ నగర్ పట్టణంలోని 14 వ వార్డులో ప్రగతి ప్రణాళిక చర్యలలో భాగంగా ఆయన స్వయంగా పరిశుద్ధ కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. సిబ్బందికి ప్రోత్సాహకరంగా వైస్ చైర్మన్ మోహన్ స్వయంగా చెత్తను తొలగించారు. తన చేతితో చెత్తను తీసిపారేశారు. మోహన్ ఇలాంటి ఆడంబరాలకు వెళ్లకుండా స్వయంగా ఆడుతూ పాడుతూ శ్రమదానం చేయడంతో ప్రగతి ప్రణాళిక చర్యల కార్యక్రమానికి ఆయన హైలెట్ నిలిచారు.



ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్

పురపాలికలో 99 రోజుల ఈ కార్యక్రమన్ని ఆయన స్థానికులతో కలిసి లాంఛ నంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ మాట్లాడుతూ.. వివిధ వార్డు పారిశుద్ధ్య కార్యక్రమాలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా పనులను తనతో సహ అందరూ పర్యవేక్షి ంచాలని పలువురు అధికారులకు, సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో పాలకమండలి సభ్యులు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రహదారులపై చెత్త పేరుకుపోకుండా చూడాలని, డ్రైనేజీ కాలువల్లో మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిలిచే గుంతలను గుర్తించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాము, గోపాల్, కొండ యాదయ్య, పాషా, నౌషత్, రవి, చిన్న, రాంపల్లి కృష్ణ, రవి, నందిగామ శ్రీశైలం, శ్రీదేవి, వార్డ్ ఆఫీసర్ అనూష, అంగన్వాడి టీచర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

# బోరు వేయించి నీటి సమస్య తీర్చిన కౌన్సిలర్ భాస్కర్

**మేడ్చల్, మార్చి 7. ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ పరిధి శ్రీరంగవరం గ్రామంలో 21వ వార్డ్ కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్ తన స్వంత డబ్బులు వెచ్చించి బోరు వేయించాడు. చాలాకాలంగా శ్రీరంగవరంలో నీటి సమస్య నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తాగు నీటి సమస్య తీర్చడానికి గాను కౌన్సిలర్ బోరు వేయడంతో నీరు పుష్కలంగా వచ్చింది. దీంతో నీటి సమస్య తీరిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌ను అభినందించారు. కాగా అభివృద్ధిలో వార్డు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కౌన్సిలర్ కోరాడు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, లక్షి ్మ సురేందర్, నర్సింహ, ఓం ప్రకాష్, నాయకులు యూనిస్ పాషా, జీవన్, బాలరాజు, కొండల్ రెడ్డి, మాధవరెడ్డి, రంగారెడ్డి, శశాంక్ రెడ్డి, శ్రావణ్, నర్సింహ, విష్ణు, భూషణం తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగవరం గ్రామంలో బోరు వేయిస్తున్న కౌన్సిలర్ భాస్కర్

# కేటీఆర్‌ను కలిసిన చేవెళ్ల నాయకులు

**చేవెళ్ల, మార్చి 7, ప్రభాతవార్త :** భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ను శనివారం చేవెళ్ల నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గచ్చిబౌలిలోని కేటీఆర్ నివాసంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భేటీ జరిగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణ రెడ్డి, చేవెళ్ల మండల పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రామ గౌడ్, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, తలారి యాదయ్య, కరుణాకర్ రెడ్డి, చాకలి కృష్ణ, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇద్దాం

**చేవెళ్ల, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రజలందరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చేవెళ్ళ మునిసిపాలిటీ చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో పరిశుభ్రత పనులు చేపట్టారు. 99 రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం సందర్భంగా మున్సిపల్ సిబ్బంది పరిసర ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రజలతో కలిసి వీధులలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, కాలనీలలో పరిశుభ్రత పనులు నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశం, వైస్ చైర్‌పర్సన్ రాములు, వార్డ్ కౌన్సిలర్లు, దూత మల్లేష్, దప్పు సువర్ణ చందు, శ్రీమతి శైలజ ఆగి రెడ్డి, తదితరు పాల్గొన్నారు.



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అధికారులు

# కొత్త వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని వినతి

**చేవెళ్ల, మార్చి 7, ప్రభాతవార్త :** అంతారం గ్రామంలో పాత వాటర్ ట్యాంక్ వినియోగానికి అనుకూలంగా లేకపోవడంతో దాని స్థానంలో కొత్త ట్యాంక్ నిర్మించాలని సర్పంచ్ జుట్టు రామస్వామి మిషన్ భగీరథ డీఈ హారికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి నామ శ్రీకాంత్, వార్డు సభ్యుడు ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.



# భూ సర్వేకు మోడల్ గ్రామాలుగా నవలయపల్లి, అంతారం

**చేవెళ్ల, మార్చి 7, ప్రభాతవార్త :** భూ భారతి భూ సర్వే కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మండలంలోని నవలయపల్లి, అంతారం గ్రామాలను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. నవలయపల్లిలో గ్రామసభ నిర్వహించి భూముల సరిహద్దులు, యాజమాన్య వివరాలను సర్వే చేసి డిజిటల్ రికార్డులుగా నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జుట్టు రామస్వామి, ఆర్ఐ చంద్రమోహన్, ఉప సర్పంచ్ వెంకటేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యుడు అశోక్ పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

# దేవాలయంలో చోరీకి యత్నం..నిందితుడి రిమాండ్

**ఘట్‌కేసర్, మార్చి 7, ప్రభాతవార్త:** దేవాలయంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు. ఘట్‌కేసర్ డివిజన్ లింగాలకుంటలోని స్వయంభూ శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి కీసరకు చెందిన ఆవుల రాజుయాదవ్ అనే వ్యక్తి ప్రవేశించి లోపల ఉన్న హుండీని పగులగొట్టడానికి ప్రయత్నించాడు. శబ్దం కావడంతో స్థానికులు చూసి రాజుయాదవ్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆలయంలో చోరీ చేయడానికి వచ్చినట్లు నిర్ధారణ కావడంతో రాజుయాదవ్‌ను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు.



# ప్రధానమంత్రి ఖేల్ సంసద్ మహోత్సవ పోస్టర్ విడుదల

పాలమూరు ఎంపీ డికె అరుణ

**షాద్ నగర్, మార్చి 7, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ పాలమూరు పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ ప్రధానమంత్రి ఖేల్ సంసద్ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ మరియు క్రీడాకారుల నమోదు కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్రీడలు మనిషిని మానసికంగా దృఢంగా, శారీరకంగా బలంగా తీర్చిదిద్దుతాయని, అందుకే దేశవ్యాప్తంగా యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి ఆలోచనతో ప్రధానమంత్రి ఖేల్ సంసద్ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో ఈ క్రీడా పోటీలు మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు, అనంతరం పార్లమెంట్ స్థాయి వరకు పెద్ద ఎత్తున నిర్వహించబడతాయని చెప్పారు. యువత మరియు క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు పోస్టర్‌లో ఇవ్వబడిన క్యూఆర్ కోడ్ లేదా ఆన్‌లైన్ లింక్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఖేల్ సంసద్ మహోత్సవ నియోజకవర్గ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, ప్యాట విష్ణు వర్ధన్, భాస్కర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపి డికె అరుణ

# మనిషి యొక్క భవిష్యత్తు విద్యార్థి దశనుండే మొదలవుతుంది

**మోమిన్‌పేట్, మార్చి 7, ప్రభాతవార్త:** మనిషి జీవితంలో పది మందికి ఆదర్శంగా నిలవాలంటే విద్యార్థి దశనుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలని వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు కే.ఎల్.ఆర్ ట్రస్టు సౌజన్యంలో న్యూ ఏజ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కావలి శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేసిన సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు వ్యక్తిగత వికాస శిక్షణ తరగతులు నిర్వహించడం గర్వకారణం అని అలాగే విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకొని ఇతరులకు ఆదర్శంగా నిలిచి, తల్లిదండ్రులకు, గురువులను గౌరవించి పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించి ఉన్నతమైన స్థానంలో ఉండాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జీవిత లక్ష్యం, జీవన నైపుణ్యాలు, విలువలు, సంభాషణ నైపుణ్యాలు, అలాగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇలాంటి కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహిస్తే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన వారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాలు మల్లేశం, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యా కమిటీ గ్రామస్తులు పాల్గొన్నారు.





# సాంకేతిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి

రైతు అవగాహన సదస్సులో అధికారులు

**షాబాద్, మార్చి 7, ప్రభాతవార్త :** షాబాద్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల వ్యవసాయ సంచాలకులు సురేష్‌బాబు హాజరై రైతులకు పలుసూచనలు ,సలహాలు అందజేసి మాట్లాడారు. నానో ఎరువుల వినియోగం గురించి వివరించుతూ, నానో యూరియా, నానో డి.ఏ.పీ. వంటి ఎరువులను సరైన మోతాదులో పిచికారీ చేయడం ద్వారా పంటల ఎదుగుదల మెరుగు పడడంతో పాటు ఎరువుల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పర్యావరణానికి హాని లేకుండా పంటల ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు మరియు సాంకేతిక సహాయం గురించి కూడా రైతులకు వివరించారు. కలుపు మందు వాడకం పెరిగి వాతావరణం కలుషితం కావడం మాత్రమే కాకుండా జీవవైవిధ్యం దెబ్బతింటుందని తెలిపారు. అలాగే ఇతర పత్తి హైబ్రిడ్ల కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రతి పత్తి మొక్క మరియు కలుపు మొక్క మధ్య క్రాసింగ్ జరిగి, కలుపు మందులను తట్టుకునే జనులు కలుపు మొక్కల్లోకి ప్రవేశించే అవకాశం ఉంటుందని వివరించారు. తద్వారా కలుపు మొక్కలు కూడా కలుపు మందులను తట్టుకునే స్వభావాన్ని ఏర్పర చుకుని సూపర్ వీడ్స్‌గా మారే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, ఏఈఓలు శివ తేజ, లిఖిత, రాజేశ్వరి, గాయత్రి, గీత, మోనిక , పాల్గొన్నారు.

# అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి

స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

**నందిగామ, మార్చి 7, ప్రభాత వార్త:** నందిగామ మండల కేంద్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హత కలిగిన నిరుపేదలకు ఇవ్వాలని శనివారం ఎమ్మార్వో సైదులుకు స్థానిక బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తయిన పంపిణీ చేయడానికి అధికారుల సమక్షంలో డ్రా తీసిన బిఆర్ఎస్ నాయకుల నిర్లక్ష్యంతో ఇవ్వలేక పోయామని వారు విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిజమైన అర్హులను గుర్తించి పారదర్శకతతో ఇండ్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు.

# ఇందిరమ్మ పథకంతో సాకారమైన సొంతింటి కల..

**దుద్యాల్, మార్చి 7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఈర్లపల్లి లో ఈశ్వరమ్మ, వెంకటయ్య గౌడ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్య ప్రకాష్, సర్పంచ్ మొగులయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు సీతారాం నాయక్, పులిందర్ రెడ్డి, కృష్ణ, నర్సిరెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న నాయకులు

# ఎన్.ఆర్.ఈజీ.ఎస్ 10 లక్షల నిధులతో డ్వాక్రా భవన నిర్మాణానికి భూమిపూజ

**మోమిన్‌పేట్, మార్చి 7, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో ఎన్.ఆర్.ఈజీ.ఎస్ పథకం ద్వారా మంజూరైన 10,లక్షల రూపాయలతో నూతన డ్వాక్రా భవనానికి భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నుండి ఇప్పటి వరకు మా గ్రామానికి ఎలాంటి నిధులు మంజూరు కాలేవని వారు పేర్కొన్నారు. శనివారం గోవిందాపూర్ గ్రామంలో నూతన డ్వాక్రా భవనానికి భూమి పూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో నూతన సర్పంచులు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం మా గ్రామానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బైండ్ల బిచ్చయ్య, మాజీ సర్పంచ్ పోచయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి జగన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సురేందర్, కృష్ణ, రవీందర్ బిట్టు, నర్సింలు, మల్లన్న పటేల్, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా భవనానికి భూమి పూజ నిర్వహిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి గోవింద్.



న్యాయమూర్తి స్వాతిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

# మహిళలు తమ హక్కులను పరిపూర్ణంగా ఆస్వాదించాలి

షాద్‌నగర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ స్వాతిరెడ్డి

షాద్‌నగర్ బ్లాక్ ఆఫీస్ గ్రౌండ్ వాకర్స్, యోగా సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిని సన్మానించిన వాకర్స్ అసోసియేషన్

**షాద్‌నగర్, మార్చి 7, ప్రభాతవార్త:** మహిళలు తమ హక్కులను పరిపూర్ణంగా ఆస్వాదించాలని షాద్ నగర్ అడిషనల్ డిస్టిక్ జడ్జ్ స్వాతి రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బ్లాక్ ఆఫీస్ గ్రౌండ్ వాకర్స్, యోగా సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మున్సిపాలిటీలోని పారిశుద్ధ మహిళా కార్మికులకు మధ్యాహ్న భోజన టిఫిన్ బాక్స్, టవల్స్ అందజేసి ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిస్టిక్ జడ్జ్ స్వాతి రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాహితీలు ముఖ్య అతిథులుగా హాజరై పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి స్వాతి రెడ్డి మాట్లాడుతూ.. తల్లి తన పిల్లలపై వివక్ష చూపకుండా పెంచి పెద్ద చేయాలని సూచించారు. అలాగే వారు భావిభారత పౌరులుగా ఎదిగేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జడ్జ్ స్వాతి రెడ్డి వాకర్, యోగా సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. షాద్ నగర్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి సాహితి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా సామాజికంగా అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. మహిళలు కేవలము ఇంటికే పరిమితం కాకుండా సమాజంలో జరిగే మంచి కార్యక్రమంలో పాల్గొని తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వీరితో పాటు పట్టణ మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆమెను ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



మహిళ కార్మికులకు టిఫిన్ బాక్సులను అందజేస్తున్న దృశ్యం

# ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్ లను సన్మానించిన నేతలు

**షాద్‌నగర్, మార్చి 7, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణంలో ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సరిత, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిలను కలిసి శాలువా కప్పి పూలబొకు అందజేసి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు మహమ్మద్ ఇబ్రహీం, ప్రముఖ వ్యాపారవేత్తలు సోఫియాన్, జాహెద్,నాని తదితరులు పాల్గొన్నారు.



ఆర్డిఓను సన్మానిస్తున్న నాయకులు

# మహిళలూ.. మీరే మహారాణులు..

మున్సిపాలిటీలో మహిళలకు సత్కారం..

**షాద్‌నగర్, మార్చి 7, ప్రభాతవార్త :** మహిళలే మహారాణులు.. అన్న నానుడిని నిజం చేస్తూ వివిధ రంగాలలో దూసుకుపోతున్న మహిళలు మున్సిపాలిటీలో కూడా అటు ఎన్నికలలో ఘన విజయం సాధించడం, ఇటు పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా సమాజ సేవకు ముందుకు సాగడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందెమోహన్, కమిషనర్ సునీత రెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మహిళ కౌన్సిలర్లను, పారిశుద్ధ్య మహిళా కార్మికులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి దాకా సమాజ సేవలో నిమగ్నమైన మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, వారికి తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు.

మహిళలతోనే ప్రగతి..

అగ్గనూరు బస్వం, మున్సిపల్ చైర్మన్

మానవ జీవితంలో సగభాగమైన మహిళలు ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కూడా సమాన ప్రాతినిధ్యం వహిస్తూ నేటి సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నారని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అన్నారు. సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కూడా మహిళలే కీలకపాత్ర పోషిస్తున్నారని ఆయన వెల్లడించారు. మహిళలు అని రంగాలలో ముందడుగు వేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులు కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశారని, ప్రతినిత్యం పరిశుభ్రత కోసం వారు చేసే ప్రయత్నం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో వారికి ఎలాంటి కష్టం రాకుండా అండగా ఉంటామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మీరు ఆకాశంలో సగం

మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్

మహిళలు ఆకాశంలో సగమని వారు లేనిదే ఈ సమాజం లేనిదని మున్సిపల్ వైస్ చైర్మన్ అందెమోహన్ మహిళలను అభినందించారు. మాతృమూర్తి శక్తి ఎంతో గొప్పదని ఈ సమాజం వారి చేతుల్లోని ఉందని నేడు రిజర్వేషన్లలో సగం మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఈ దేశానికి సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ లాంటి డైనమిక్ మహిళలు రాజకీయంగా ఎంతో అవసరం ఉందని అందెమోహన్ తెలిపారు.



మహిళ ప్రజా ప్రతినిధులు సన్మానిస్తున్న దృశ్యం

# మహిళలు చైతన్యవంతంగా ఉండాలి.. కమిషనర్ సునీత రెడ్డి..

బయటి ప్రపంచానికి వచ్చి పనులు చేసి సమాజ సేవకు ముందడుగు వేస్తున్న మహిళలు చైతన్య వంతంతో ఉండాలని కమిషనర్ సునీత రెడ్డి అన్నారు. ఏ రంగం లోనైనా మహిళలకు సహజంగా ఇబ్బందులు ఉంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగి విజయం సాధించాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన మహిళా కౌన్సిలర్లు, మహిళ పారిశుధ్య కార్మికులను సన్మానించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్ర మంలో మహిళా కౌన్సిలర్లు పెద్దఎత్తున హాజరయ్యారు.





సంస్కృతిలో విద్యార్థినులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

# సంస్కృతిలో ఉత్సాహంగా ఖేలో ఇండియా క్రీడాపోటీలు

**ఘట్‌కేసర్, మార్చి 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థినులకు పలు క్రీడాపోటీలు నిర్వహించారు. అంతర్జాయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎఎస్ఎంఐటిఏ-ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపోటీల్లో పలు పాఠశాలలు, కళాశాలల నుంచి దాదాపు 650 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్-13, అండర్-18, 18 సంవత్సరాలపై బడిన విభాగాల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందాలు, ఫన్నీ గేమ్స్ నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్కృతి కళాశాల ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.జానకిరాములు, డైరక్టర్ డాక్టర్ మల్లారి రమాకాంత్‌రెడ్డిలు విచ్చేసి గెలుపొందిన విద్యార్థినులకు పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎం.హరిప్రసాద్, పిజికల్ డైరక్టర్ సురేష్, మైభారత్ టీమ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మున్సిపల్ కార్మికురాలు మృతి

-కుటుంబాన్ని ఆదుకోవాలి: సిఐటియు

**ఘట్‌కేసర్, మార్చి 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో మున్సిపల్ కార్మికురాలు అల్లం లక్ష్మీనర్సమ్మ అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతురాలు గ్రామపంచాయతీ ఉన్నప్పటి నుంచి గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తుంది. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పరిశుభ్రత పనులు చేసిందని స్థానికులు తెలిపారు.

ఎదులాబాద్‌లో శనివారం లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు జరుగగా సిఐటియు నాయకులు చింతల యాదయ్య, నార్కట్‌పల్లి సభితలు వచ్చి ఆమె పార్థివదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ఆమె తన ఆరోగ్యాన్ని కాపాడుకోలేకపోయారని ప్రభుత్వం ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులు మల్లేశ్, సుజాత, కిష్టమ్మ, శ్రావణి, బిక్షపతి, రాంచందర్, వేణు, సుజాత, పద్మ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనర్సమ్మ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న సిఐటియు నాయకులు




పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామంలో పారిశుధ్యం-పరిశుభ్రత పట్ల అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ దయాకర్ తదితరులు

## పారిశుధ్యం-పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యం

**సర్పంచ్ దయాకర్**

**పూడూరు, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రతిఒక్కరు గ్రామంలో పారిశుధ్యం పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందని సర్పంచ్ టి.దయాకర్ పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రం ఆవరణతోపాటు వివిధ కాలనీల్లో చెత్తను తొలగించి పారిశుధ్యం-పరిశుభ్రతపట్ల అవగాహనను కలిపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మంచినీటి కొరత లేకుండా తగుజాగ్రత్తలు తీసుకోనున్నట్లు వివరించారు.మరుగునీటి కాలువల పరిశుభ్రతతోపాటు పాడైన అంతర్గత సిసిరోడ్ల మరమత్తులపై దృష్టిపెట్టనున్నట్లు తెలిపారు.త్వరలో గ్రామంలో వీధిదీపాలను అమర్చనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ్,పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి,సభ్యులు నర్సింలు,గ్రామస్తులు కిష్టం రవి,రాజు,లక్ష్మయ్య,జెరాజు,తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రానగర్ గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

## ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళికా పనులు షురూ

**జిల్లెడు చౌదరిగూడ,మార్చి 7,(ప్రభాతవార్త):** గ్రామాల అభివృద్ధి కోసం ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లేడు చౌదరిగూడెం మండల పరిధిలోని ఇంద్రనగర్ గ్రామంలో సర్పంచ్ మహబూబ్ బీ ఆధ్వర్యంలో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి, ఉపాధి హామీ నర్సరీ, వివిధ కేంద్రాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని సర్పంచ్ సూచించారు. ప్రభుత్వ మార్గ నిర్దేశకాలకు, గ్రామస్తులు అభివృద్ధికి సహకరించాలని పెర్కొన్నారు. ప్రభుత్వం నుంచి విడుదల అవుతున్న నిధులతో గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నరేష్, ఉపసర్పంచ్ మంగలి శేఖర్, సర్పంచ్ తనయుడు అక్రమ్, వార్డ్ నెంబర్ లు అన్వర్, చెన్నయ్య, రజియాబి, రహుఫ్, ప్రవీణ్, గాద్దె శేఖర్, బల్వంతు, శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు జబ్బార్, శివకుమార్ గౌడ్, యాదగిరి గౌడ్, ఉస్మాన్, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం

**మేడ్చల్, మార్చి 7, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చి ముందుకు సాగుతున్నారని పలువురు అన్నారు. నేడు రాజకీయంలో కూడ మహిళలు రాణించి పాలనలో ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ రజిత, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా కౌన్సిలర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ రజిత

## టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 7, ప్రభాత వార్త:** పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో మంచిమార్కులు సాధించి ఉత్తీర్ణులు కావాలని సూర్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని కొర్రెముల, ప్రతాపసింగారం గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యువజన సంఘం ఆధ్వర్యంలో ఎగ్జామ్ పాడ్స్, పెన్నులను శనివారం పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు త్వరలో జరుగనున్న పరీక్షలకు హాజరై చక్కగా వ్రాసి ఉత్తీర్ణులు కావాలని అన్నారు. పరీక్షల గడువు మరింత దగ్గరపడుతుండటంతో విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలకు హాజరై మంచిగా పరీక్షలు వ్రాయలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు ప్రభు గౌడ్, రఘురాం రెడ్డి, పాశం లక్ష్మణ్ యాదవ్, సంతోశ్ నాయక్, రాఘవేందర్, తిలక్ నాయక్, మహీందర్ నాయక్, కొమ్ముల ప్రశాంత్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## విశ్వేశ్వరగిరిలో ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

**ఘట్‌కేసర్, మార్చి 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరాజరాజేశ్వరి సమేత విశ్వేశ్వరగిరి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు.

ఆలయంలో ప్రతి యేటా నూతన విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారు. శ్రీవిశ్వేశ్వరగిరి పీఠాధిపతి శ్రీఆత్మానందభారతీ, శ్రీశారదాంబ మాతాజీ, తాళ్లాయపాలెం శ్రీకోటిలింగ మహాశైవ క్షేత్రం పీఠాధిపతులు భారత ధర్మదేవత ఋషిరత్న పరమపూజ్య శ్రీశివస్వామి చేతుల మీదుగా ప్రతిష్టాపనలు నిర్వహించారు. ఆలయంలో నూతనంగా శ్రీవారాహి, శ్రీరాజశ్యామలా, శ్రీగాయత్రీ విగ్రహ ప్రతిష్టాపన పూర్వక శ్రీశనైశ్చర ధ్వజస్థంభ ప్రతిష్టాపన మహాక్షత్సవం వైభవంగా జరిపారు. ఈనెల 2 నుంచి జరుగుతున్న పూజల్లో భాగంగా చివరిరోజు పునఃపూజలు, వేదపారాయణ, దేవతోత్థానం, ఆలయ ప్రదక్షిణ గర్తపూజ, ధాతున్యాసం, రత్నన్యాసం, బీజన్యాసం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట కళావాహన, నేత్రోన్మీలనం, మహకుంభాషేకం, గో, కన్యా, దర్పణ, తృణాగ్ని దర్శనం, మహౌదనబలి, ధ్వజ అవరోహణ, మహాపూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, పండిత సత్కారం, మహాదాశీర్వచనం, దీక్షావరమణ తదితర పూజలు నిర్వహించారు. చండీ ఉపాసకులు, జ్యోతిషవరాశర, స్మార్తభట్టరక సంస్కార శేఖర బ్రహ్మ శ్రీ రాజోలు భానురవికిరణశర్మ వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రతిష్టాపన పూజలు జరిగాయి.

## అక్రమ రిజిస్ట్రేషన్‌తో ప్లాట్లు ఆక్రమించిన ఐదుగురు రిమాండ్

**ఘట్‌కేసర్, మార్చి 7, ప్రభాతవార్త:** ప్లాట్ల అసలు యూజమానికి బదులుగా వేరొకరిని చూపించి అక్రమంగా స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకొని ఆక్రమించిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఘట్‌కేసర్ డివిజన్ పటేల్‌నగర్ వెంచర్‌లోని రెండు ప్లాట్లను ఘట్‌కేసర్, అన్నోజీగూడకు చెందిన ఐదురుగు వ్యక్తులు కలిసి ప్లాట్ల అసలు యాజమాని బదులుగా వేరొకరిని ఓనర్‌గా చూపిస్తూ స్పెషల్ పవర్ ఆఫ్ ఆటర్నీ పొంది వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొని స్థలాలు ఆక్రమించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈకేసులో కాసుల గణపతి, సాలూరి రమేశ్, తోక శ్రీరాములు, ఇరిటం జగదీష్, హసన్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## మంబాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డిఎల్‌పిఓ

**..డిఎల్‌పిఓ ప్రవీణ్‌కుమార్**

**పెద్దేముల్, మార్చి 7, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని డిఎల్‌పిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం పెద్దేముల్ మండలం మంబాపూర్ ప్రాథమిక పాఠశాలను డిఎల్‌పిఓ సందర్శించి పారిశుద్ధ కార్మికులు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడి సెంటర్, మార్కెట్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని వార్డులలో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో పాలకమండలి సభ్యులు భాధ్యతయుతంగా వ్యవహరించాలని అన్నారు. వీధులలో చెత్త పేరుకుపోకుండా చూడాలని, డ్రైనేజి కాలువల్లో పేరుకుపోయిన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దెలగట్టు భార్గవి, ఉపసర్పంచ్ మోహిద్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్, నాయకులు వై.శ్రీనివాస్, కిరన్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ

## ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

**...అన్ని దానాలలో అన్నదానం మహదానం**

**..ఆలయ ఫౌండర్ బిచ్చప్ప**

**పెద్దేముల్, మార్చి 7, ప్రభాతవార్త:** ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ ఫౌండర్ బిచ్చప్ప అన్నారు. శనివారం ఖాంజాపూర్ గుట్ట వద్ద గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో దాతలు ప్రవళిక, రాముచారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ బిచ్చప్ప మాట్లాడుతూ దాతలు ప్రవళిక, రాముచారీ ఏడువారాల పాటు ప్రతి శనివారం స్వామివారి అభిషేకం, దర్శనం అనంతరం అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఆలయ అభివృద్ధికి మరికొందరు దాతలు ముందుకు రావాలని అన్నారు. సమాజసేవే పరమార్ధంగా భావించి స్వామి వారి సన్నిధిలో అన్నదానం చేయడం మహ పుణ్యమని అన్నారు. స్వామివారి కరుణ కటాక్షాలు దాతలపై ఎల్లవేళల ఉండాలని ఆకాంక్షించారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీనిధి యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రారంభం

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 7, ప్రభాత వార్త:** పరిశ్రమలు బలోపేతం కావడానికి తాజా ఆవిష్కరణలు సాంకేతికత నైపుణ్యతలను పెంపొందించుకోవాల్సిన అవసరముందని శ్రీనిధి యూనివర్శిటీ ఉపకులపతి డాక్టర్ అనంత్ పద్మనాభన్ అన్నారు. పోచారం డివిజన్ యంనంపేట్ పరిధిలోని శ్రీనిధి యూనివర్శిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనిధి స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను శనివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యను మరింత బలోపేతం చేసే విధంగా శ్రీనిధి బిజినెస్ స్కూల్ విశ్వసనీయతను పెంపొందిస్తుందని అన్నారు. స్వీయ అవగాహన పెంపోందించుకోవడంతో పాటు ఆలోచనలు అమలు చేయగల సామర్థ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని అన్నారు. శ్రీనిధి యూనివర్శిటీ అధ్యక్షుడు అభిజిత్‌రావు మాట్లాడుతూ బీబీఏ కోర్సు ద్వారా జ్ఞానంతో పాటు విలువైన నైపుణ్యత లభిస్తాయని అన్నారు. నేటి సమాజంలో నెలకొన్న పోటీతత్వంలో వ్యాపార నిర్వహణ విద్యపై పునరాలోచన చర్చాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాడ్ఆన్‌మో కో ఫౌండర్ గాజుల శ్రవత్, ప్రో ఛాన్సలర్ నర్సింహరెడ్డి, జెన్‌జియాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంటు జనని ప్రకాశ్, జేపీ మోర్గాన్ వైస్ ప్రెసిడెంటు మారియో డేవిడ్, డిజిటల్ మార్కెటింగ్ డైరక్టర్ హరణ్మయిరావు, వెల్స్ ఫార్గో టెక్నికల్ డైరక్టర్ శ్రీనివాస ఆరవల, ఇన్నోవేషన్ డైరక్టర్ మైత్రేయ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



యంనంపేట్ శ్రీనిధి యూనివర్శిటీలో బిజినెస్ స్కూల్‌ను ప్రారంభించిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆనంత్ పద్మనాభన్ తదితరులు.




లబ్ధిదారులకు గ్యాస్ కనక్షన్ సిలిండర్లను అందజేస్తున్న దృశ్యం

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తుంకర్ శివాజీ**

**కేశంపేట, మార్చి 7, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను నిరుపేద ప్రజలు సద్వినియోగించుకోవాలని బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తంకర్ శివాజీ అన్నారు. శనివారం కేశంపేట మండల కేంద్రంలో మణి రాఘవేంద్ర భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా మంజూరు అయిన గ్యాస్ కనక్షన్ సిలిండర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత్ గ్యాస్ డీసిబుటర్ గుండ్రతి రమణా గౌడ్..బిజెపి సంస్కృతి శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేంద్రర్ రెడ్డి.పాండు గౌడ్.దసరి మహేష్.సాయి .కిరణ్ .పిల్లిమహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన సదస్సు

**డి ఆర్ డి ఏ వాసన్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి , ఎపిఎం కవిత**



**కేశంపేట, మార్చి 7, ప్రభాతవార్త :**
కేశంపేట మండల పరిధిలోని రైతుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎపిఎం కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఏపిఎం కవిత మాట్లాడుతూ శనివారం కేశంపేట మండల పరిది లోని వేముల నర్వ, ఏ క్లాస్ కాన్ పేట, సంగెం గ్రామాలలోని రైతులకు ఐఫ్సి సెల్ఫ్ వాసన్ సంయుక్త ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం పశుపోషణ పంటల వైవిధ్యం వినియోగం కాటిల్ చెట్ల ప్రాముఖ్యతను వాసన్ తదితర అంశాలపై రైతులకు వాసన్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి ్మ అవగాహన కల్పించారు. రైతుల ఆర్థికకాభివృద్ధి ప్రజల ఆరోగ్యం కోసం ప్రకృతి సాగు పద్ధతులను పాటించాలని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ డిసిఎం నర్సింలు, అంజలయ్య గోపాల్, లాస్య, లక్ష్మణ్, విజయ, సిసిలు యాదయ్య, అలివేల, మంజుల, జ్యోతి, భాగ్య మల్లేష్, జంగయ్య, సునీతమ్మ లలిత, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కేశంపేట, మార్చి 7, ప్రభాతవార్త :**
ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా రెండవ రోజు కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి పాఠశాల పరిసరల పరిశుభ్రత తదితర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్ర కుమార్ రెడ్డి తహసిల్దార్ రాజేందర్ రెడ్డి ఎంపి ఓ కిష్టయ్య సర్పంచ్ రమేష్ కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిస కరుణాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**షాద్‌నగర్, మార్చి 7, ప్రభాతవార్త:** షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ కొంకల్లకేరి కాలనికి చెందిన పసుపుల యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ రిజ్వానా బేగం ముబారక్ అలీ ఖాన్ తన వంతు సహకారంగా ఆ కుటుంబానికి అండగా ఉంటానని 5000 అంత్యక్రియలకు కాలనీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి తన వంతు సహాయంగా అంత్యక్రియల నిమిత్తం రూ. 5000 మృతురాలు కుటుంబ సభ్యులకు అందజేశారు, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## క్రైస్తవ స్మృతివనం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**ఘట్‌కేసర్, మార్చి 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండల ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మదారం క్రైస్తవ స్మృతి వనం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ మాదారంలో జరిగిన కార్యక్రమంలో అధికారుల సమక్షంలో జీఎంపిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ సభ్యులుగా జాన్‌మార్క్ భూపతి, వి.శ్రీనివాస్, ఈ.మార్టిన్, డి.పుల్లయ్య, పి.సునీల్‌కుమార్‌లుగా ఎన్నిక కాగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా అధికారులు, పోలీసులు, మండలంలోని ఫాస్టర్లు, జీఎంపిఎఫ్ నాయకుల సమక్షంలో కమిటీ సమావేశమై పలు తీర్మానాలను ఆమోదించారు. క్రైస్తవ స్మృతివనంలో స్నానాలగదుల నిర్మాణం, పరిసరాలు శుభ్రం చేయడం, రోడ్లు వేయడం, కరెంట్ స్తంభాల ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, సమాధుల కోసం తవ్వకాల ధర నిర్ణయించడం వంటి తీర్మాణాలను చేశారు. ఏచర్చి నుంచి పార్థికదేహం వచ్చినా తప్పకుండా చర్చి నుంచి లేఖ, ఆధార్‌కార్డు కమిటీ సభ్యులకు అందజేయాలని తీర్మాణించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ సర్కిల్ ఎఎంసి బి.నాగేశ్వర్‌రావు, ఎస్ఐలు బి.ప్రభాకర్‌రెడ్డి, షేక్‌హీనా, గిర్దావర్లు కావ్య, సాయిరాం, మాజీ సర్పంచ్ అల్లోళ్ల యాదగిరి, జిపిఓలు, చర్చీల ఫాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



మాదారంలో అధికారుల సమక్షంలో క్రైస్తవ స్మృతివనం కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

## మున్సిపల్ మహిళ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

**మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్**

**కొంతల్,మారిరి 7జుఎంభోవారటీ**

రపజా పాలన ప్రగతి ప్రణాళిక,ప్రగతిని ప్రతి గడపకు చేర్చడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్ అన్నారు.తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శాంతినగర్ వాటర్ ట్యాంకు దగ్గర కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,జడ్పీసీఈఓ సుధీర్,మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌లతో కలిసి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు.వాటర్ ట్యాంకు పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తు స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.అలాగే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ మహిళ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ శంకర్‌నాయక్,ఎంఆర్ఓ రాంబాబు,ఎంఈఓ రాంరెడ్డి,ఎంపీడీఓ ఉషశ్రీ,మున్సిపల్ కౌన్సిలర్లు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్, అధికారులు



మున్సిపల్ మహిళ పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు,పెన్నులు అందజేస్తున్న సర్పంచ్ భాస్కర్ గౌడ్,తదితరులు

## పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలి

**కేశంపేట, మార్చి 7, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం గ్రామ ఉపసర్పంచ్ సఫూరా ఆమేర్ పరీక్ష ప్యాడ్లను, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా, ఏకాగ్రతతో రాయాలని సూచిస్తూ పరీక్ష ప్యాడ్లను పెన్నులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన మలుపు అని తెలిపారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచిస్తూ ప్రోత్సహించారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం క్రమశిక్షణతో చదవాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.పరీక్షల సమయంలో విద్యార్థులకు అవసరమయ్యే ప్యాడ్లను పెన్నులను పంపిణీ చేసిన ఉప సర్పంచ్ సఫూరా ఆమేర్ కు విద్యార్థులు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ వార్డు సభ్యులు నాగరాజు, రమేష్, చంద్రయ్య, రిజ్వానబేగం మోహిజ్ నాయకులు జంగయ్య, ఖాజాపాషా, ముత్యాలు, శేఖరప్ప, రాజేందర్, సాయి, రమేష్ పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో భాగంగా మెగా వైద్య శిబిరం

**కేశంపేట, మార్చి 7, ప్రభాతవార్త:**
ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సోమవారం కేశంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉదయం 9 గంటల నుండి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ సిబ్బంది తెలిపారు. ఈ క్యాంపులో జనరల్ మెడిసిన్, డెంటల్, ప్రసూతి ,ఎముకలు, కంటికి సంబంధించిన, చిన్నపిల్లల డాక్టర్లు పాల్గొంటారని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా మండల పరిధిలోని గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకునేందుకు సోమవారం కేశంపేట ఆరోగ్యకేంద్రానికి వచ్చి తమ తమ ఆరోగ్య పరిస్థితిని ప్రత్యేక డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, తమ ఆరోగ్య పరిస్థితిని బట్టి మందులు కూడా ఇస్తారని ఈ అవకాశాన్ని మండల పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

## గూడు సొంతమాయే.. గుండె నిండిపోయే.

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , మాజీ జడ్పిటిసి

**కేశంపేట, మార్చి 7, ప్రభాతవార్త:**
ఉండడానికి ఒక చిన్న ఇల్లు చాలు. ఇది ప్రతి ఒక్కరి జీవితాశయం.. కానీ నిరుపేదలకు ఆ అవకాశం ఉండదు.. అందుకే ప్రభుత్వం ప్రతి పేదవాడికి గూడు ఇవ్వాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టింది.. ఈ క్రమంలోనే కేశంపేట మండలం దేవుని గుడి తాండాలో లబ్ధిదారులు సంతోషి, జయేందర్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవుని గుడి తండాలో రూ.7 లక్షలతో సిసి నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు లబ్ధిదారు తన ఆడపడుచుగా భావిస్తూ వారికి నూతన వస్త్రాలను అందించారు. ప్రేమాభిమానాలతో వారి కుటుంబంతో మాట్లాడి వాళ్ళ గుండెల్లో ఆనందాన్ని నింపారు. ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వం తమకు మంజూరు చేయడం, తమ చిరకాల వాంఛను నెరవేర్చడం చాలా ఆనందంగా ఉందని లబ్ధిదారులు ఈ సందర్భంగా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నిరుపేదల సొంత ఇంటి కల తీర్చేది కాంగ్రెస్ మాత్రమే. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాటి నుంచి నేటి వరకు నిరుపేదల ఇంటికలను తీరుస్తున్నది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గతంలో ప్రధానిగా ఇందిరాగాంధీ నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, తర్వాత కాలంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా ఇందిరమ్మ పేరిట ఇండ్లు ఇచ్చారని గుర్తు చేశారు. అదే సంప్రదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లను అర్హులందరికీ ఇస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావడం, వాటికి గృహప్రవేశం చేయడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భవిష్యత్తులో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా ఏర్పాట్లు చేస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అల్వాలలో పరిశుభ్రత కార్యక్రమం

**రైతు వేదికలు, నర్సరీలను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి రమాదేవి**

**కేశంపేట, మార్చి 7, ప్రభాతవార్త:** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ సంచాలకులు రమాదేవి అల్వాల, కొత్తపేట గ్రామాల్లోని రైతు వేదికలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించి, వాటి నిర్వహణపై అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. రైతులకు ఉపయోగపడే విధంగా రైతు వేదికలను సక్రమంగా నిర్వహించాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి వ్యవసాయ అధికారి ఎం ఏ ఓ శోభారాణి, అల్వాల గ్రామ సర్పంచ్ లంకాల సురేష్ రెడ్డి, కొత్తపేట గ్రామ సర్పంచ్ హైమవతి, అల్వాల్ డిప్యూటీ సర్పంచ్ మల్లేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఏ ఈ ఓ లు వినయ్, నిఖిల్ రెడ్డి, ప్రశాంత్, సుధ, సమీన, రాజేశ్వరి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



అల్వాల, కొత్తపేట గ్రామాల్లోని రైతు వేదికలను సందర్శించిన ప్రత్యేక అధికారి రమాదేవి ,తదితరులు